
# బహుమతి పొందిన కథ

# సోడాబుడ్డి రోయ్!



Illustrated by CHALAM

-ఎన్. మురళీకృష్ణ

ఉద్యోగంలో చేరిన పదేళ్ల తర్వాత ట్రాన్స్‌ఫర్ అయ్యి మరలా విజయవాడ వచ్చాను.

ఎందుకో నేను చదివిన కాలేజీని చూడాలనిపించింది. గవర్నమెంట్ కాలేజీలో డిగ్రీ చదువూ, ఆటలూ అన్నీ మొన్న మొన్ననే జరిగినట్లు యింకా కళ్లముందు కదులాడుతూనే ఉన్నాయి.

కాలేజీవైపు నడుచుకుంటూ బయలుదేరాను. మెయిన్ గేటు దగ్గరికి వచ్చే సరికి క్లాసులు వదిలిపెట్టినట్లున్నారు అమ్మాయిలు, అబ్బాయిలు గుంపులు గుంపులుగా బయటికి వస్తున్నారు.

క్యాంపస్ అంతా ఒక్కసారి ఉల్లాసంగా, సందడిగా మారిపోయింది. స్కూటర్లు, మోటార్ బైక్‌లమీద అమ్మాయిల పక్కనుంచి వేగంగా దూసుకుపోతూ అబ్బాయిలు, రంగు రంగుల డ్రస్సులలో, ఉత్సాహం అంతా మాలోనే వుంది అన్నట్లు అమ్మాయిలు, అన్నీ అలాగే ఉన్నాయి. మా రోజులలోలాగే వుంది అంతా....!

"ఒరేయ్, రేపు బుక్స్ తెచ్చుకోకండి. మనం మ్యాట్నీకి వెళ్ళాలి" నా పక్కనుంచే వెడుతూ ఒక అబ్బాయి దూరంగా ఉన్న ఫ్రెండ్స్‌తోటి అరిచి చెప్తున్నాడు.

నవ్వుకున్నాను.

మాకన్నా ఒక స్టెప్ ముందున్నారన్న మాట. అప్రయత్నంగానే నా ఆలోచనలు గతంలోకి పరుగెత్తాయి.

మా బ్యాచ్ అంటే కాలేజీలో మంచి గుర్తింపు వుండేది. నేనూ, రఘు, రెడ్డి, మల్లి, శ్రీనివాస్ ఎప్పుడూ ఒకే బ్యాచ్‌గా తిరిగేవాళ్ళం! రఘు యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ టీమ్‌కి అప్పట్లో కేప్టెన్. రెడ్డి కాలేజీ స్టూడెంట్ యూనియన్ సెక్రటరీనేకాదు మంచి ఫుట్‌బాల్ ప్లేయర్ కూడా. కాలేజీలో హ్యాండ్‌సమ్ బోయ్ అని మల్లిగాడిని అందరూ అంటుండేవారు. నేనూ, శ్రీనివాస్ చదువు విషయంలో ఎప్పుడూ పోటీ పడుతుండేవారం. యూనివర్సిటీ ర్యాంకు మా ఇద్దరినీ దాటి బయటికి పోకూడదని పట్టుదలగా చదువుతూవుండేవాళ్ళం.

మా బ్యాచ్ ఆరోజు క్లాసులోకి వెళ్ళే సరికి అమ్మాయిలు, అబ్బాయిలు ఒక గుంపుగా చేరి చాలా సీరియస్‌గా చర్చించుకుంటున్నారు, రాబోయే కొత్త ఇంగ్లీష్ లెక్చరర్‌కి ఏం పేరు పెట్టాలా అని.

'ఆయన చాలా పొడుగ్గా ఉంటాడుట. కొంగ అని పెడదాం' ఒక అమ్మాయి ప్రపోజ్ చేసింది.

'ఛా! అది అవుట్ ఆఫ్ ఫ్యాషన్. నిప్పుకోడి అని పెడదాం' అప్పుడే క్లాసులోకి వచ్చిన రెడ్డి సజెస్ట్ చేశాడు.

"చూద్దాం, చూద్దాం. ముందు ఆయన్ని రానీయండి" పేర్లు పెట్టే ప్రోగ్రామ్‌ని నేను తాత్కాలికంగా పోస్ట్‌పోన్ చేశాను.

ఇంతలో క్రొత్త ఇంగ్లీష్ లెక్చరర్ క్లాస్‌లోకి రానే వచ్చారు.

వస్తూనే మా అందరికేసి చూసి, 'నేను చెప్పే పాఠంలో ప్రతి ముక్కా మీరు అర్థం చేసుకుంటూ వినాలి. ఎక్కడన్నా సందేహం వస్తే వెంటనే అడగండి' అని. 'ది హెలెన్ ఆఫ్ ట్రాయ్'చెప్పడం మొదలుపెట్టారు.

'హెలెన్. ది నేమ్ ఆఫ్ బ్యూటీ' అంటూ పాఠం మొదలుపెట్టి, ఒక్కక్షణం ఆగి 'నేను వర్ణిస్తున్న హెలెన్ రూపాన్ని మీ కళ్ళముందు ఊహించుకోండి. ఎంత అందంగా కన్పిస్తుందో' అన్నారు.

'అద్భుతంగా ఉంది సార్! మాకయితే మీసాలుకూడా కన్పిస్తున్నాయి' వెనకాలనుంచి ఎవరో అమ్మాయి అరిచింది. అంతే క్లాసంతా నవ్వులు.

'ఎవరు? ఎవరది? అయి కాంట్



"సోడాబుడ్డిరోయ్" మినీ కథా రచయిత శ్రీ ఎన్. మురళీకృష్ణ.

"నేను బి.ఎస్.సి.డిగ్రీ 1989 లో నాగార్జున యూనివర్శిటీ నుండి పొంది, ప్రస్తుతం ఆంధ్రా యూనివర్శిటీలో ఎమ్.ఎస్.సి. ఫిజిక్స్ ప్రథమ సంవత్సరంలో ఉన్నాను. క్విజ్‌లు, డిబేటింగ్, వక్తృత్వం అంటే నాకు చాలా ఆసక్తి. అప్పుడప్పుడు కవితలు వ్రాయడం హాబీ. ఇండియన్ సివిల్ సర్వీసెస్‌కి సెలక్ట్ కావటం నా ధ్యేయం" అని ప్రకటిస్తున్నారు.

టాలరేట్ సచ్ థింగ్స్, ఎవరన్నారో ముందుకు రండి' లెక్చరర్ అరిచారు.

క్లాసంతా నిశ్శబ్దంగా అయిపోయింది.

అందరికేసి కోపంగా చూస్తూ లెక్చరర్ బయటకి వెళ్ళిపోయారు. అప్పటివరకూ ఊపిరి బిగవట్టుకుని కూర్చున్న క్లాసంతా ఒక్కసారి ఊపిరి పీల్చుకున్నాం.

'ఎవరది? ఎవరు అలా అరిచారు?' శ్రీనివాస్ అమ్మాయిలవేపు తిరిగి అడిగాడు సీరియస్‌గా.

'నేనే గురూ! కాస్త గొంతు మార్చా' వెనక బెంచీలోంచి మళ్లి చెప్పాడు. అంతే, క్లాసంతా మళ్ళీ గొల్లుమంది.

'మాస్టారూ! మిమ్మల్నే' ఎవరో పిలవడంతో ఆలోచనలు చెదిరి పక్కకి చూశాను. దళసరి కళ్ళద్దాలు, చేతిలో టెక్స్ట్ బుక్స్, లెక్చరర్ అనుకుంటా అక్కడ నిల్చున్నాడు.

'గుర్తుపట్టావా?' నవ్వుతూ అడిగాడు నన్ను.

'మీరు...నువ్వు శ్రీనివాస్‌వి కదూ?' గుర్తుపట్టడానికి ప్రయత్నిస్తూ అనుమానంగా అడిగాను ఆ లెక్చరర్‌ని.

'అవున్రా నేనే!' ఆనందంగా నన్ను కౌగలించుకున్నాడు.

'ఏం చేస్తున్నావురా! కాలేజీ డేస్ తర్వాత నువ్వు కన్పించలేదు' అడిగాడు.

నేను సమాధానం చెప్పేలోపల ఎవడో కుర్రాడు దూరంగా ఉన్న కుర్రాళ్ళ గుంపులోంచి 'సోడాబుడ్డిరోయ్' అని అరిచాడు

ప్రశ్నార్థకంగా చూశాను శ్రీనివాస్‌ని

'నన్నేరా, నా కళ్ళద్దాలు చూశావ్‌గా. అది వాళ్ళు పెట్టిన పేరు' చాలా మామూలుగా నవ్వుతూ చెప్పాడు.

'స్కౌండ్రల్స్! ఇలాంటివాళ్లని డిబార్ చేయించాలి' అన్నాను.

'మనం మాత్రం ఆ రోజుల్లో చేసింది ఇదేకదూ? మనల్ని డిబార్ చేశారా' వాడే అన్నాడు. అని, ముందుకు నడవడం ప్రారంభించాడు!

'అఫ్‌కోర్స్! నిజమే!' అంటూ నేనూ వాడితోపాటే నడక సాగించాను-

'ఇదేదో కొత్త శాల్తీ కాబోలు' అని అనుకుంటున్న విద్యార్థుల మాటలు నా చెవుల్లో పడ్డాయి. ○

# బహుమతి పొందిన కవిత

## బహూపరాక్! బహూపరాక్!!

ఈదేశం...
మాకేమిచ్చిందని ప్రశ్నించబడుతున్నా
నీతే చచ్చిందని పదిమంది తిడుతున్నా
సర్కారొద్దని వాళ్లెవరో 'గన్ను' పట్టుకుంటున్నా
ఉమ్మడి ఇంటిని వీళ్లెవరో చీలగొట్టమంటున్నా
వాళ్లలో నువ్వూ ఒకడివి కాకోయ్!
పాలుతాగి తల్లిరొమ్ము గుద్దకోయ్!
బహూపరాక్! బహూపరాక్!!


**  **  **

నేటి యువతి...
ఇంటివాళ్లతో 'మైనస్'గా చూడబడుతోంది
బయటివాళ్లతో నానామాటలు పడుతోంది
ఏడడుగులు అగ్నిచుట్టూ వెడుతోంది
ఎనిమిదో అడుగు అగ్నిమీదే వెడుతోంది
ఆ దుస్థితి నీ ఆలికి రానీకోయ్!
మానవత్వాన్నే కాలరాచి పారెయ్‌కోయ్!
బహూపరాక్! బహూపరాక్!!

**  **  **

రకరకాల అవినీతులు బలహీనతలు
'ఈగో'ల ఈగలు వ్యామోహాల దోమలు
రాజకీయ రొంపులు నిరుద్యోగ రొష్టులు
ఇవే ఇవే నేటి ఆరు అరిషడ్వర్గాలోయ్!
మెలకువతో వీటినే నెగ్గుకు రావాలోయ్!
బాధ్యతెరిగి భవితనే స్వర్గం చేయాలోయ్!
బహూపరాక్! బహూపరాక్!!

- సాహితి



"బహు పరాక్! బహు పరాక్!" కవితా రచయిత 'సాహితి' జన్మస్థలం కృష్ణా జిల్లా వెల్వడ గ్రామం. 1974లో ఆంధ్రా యూనివర్సిటీలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1978లో చలన చిత్ర రంగప్రవేశం చేశారు. తనను పరిచయం చేసుకుంటూ, అప్పటి నుంచి ఇప్పటి వరకూ 15 చిత్రాల్లో 50కి పైగా పాటలు వ్రాశాను. మొన్నీ మధ్య విడుదలయిన "తాతయ్య పెళ్లి – మనవడి శోభనం" చిత్రానికి రచన, దర్శకత్వం వహించాను. పత్రికా రంగానికి మొదటి సారిగా... ఈ టానా పోటీకి పంపిన నా కవితకు బహుమతి నిచ్చి ప్రోత్సహించిన ఆంధ్ర సచిత్ర వారపత్రికకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అంటున్నారు.